క్లుప్తంగా

గోదాదేవి సారె ఊరేగింపు


సారె ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

రాజాం సిటీ: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గోదాదేవికి సమర్పించిన సారెను స్థానిక పట్టణంలో ఆదివారం ఊరేగించారు. శాణావీధిలోని రాజవేణుగోపాలస్వామి ఆలయ అర్చకులు కుమ్మరగంటి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో వీధుల్లో మేళతాళాల నడుమ అంగరంగ వైభవంగా సారె ఊరేగింపు జరిగింది.

ఇంటింటికీ అయోధ్య అక్షతలు


పెనుబాకలో అక్షతలు పంపిణీ చేస్తున్న భక్తులు

రాజాం: మండలంలోని పెనుబాక గ్రామంలో ఇంటింటికీ అయోధ్య రామమందిరం నిర్మాణ అక్షతలు ఆదివారం పంపిణీ చేశారు. ఈ నెల 22వ తేదీన ఆలయం ప్రారంభోత్సవం పురస్కరించుకుని, శ్రీరాముడికి పూజలు చేసిన పవిత్ర అక్షతలను జెడ్పీటీసీ బండి నర్సింహులు చేతులమీదుగా పంచిపెట్టామని విశ్వహిందూ పరిషత్ సభ్యులు, శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ సభ్యులు, గ్రామానికి చెందిన శ్రీరామ భజన బృందం సభ్యులు తెలిపారు.

ఆక్రమణదారులు శిక్షార్హులు


హెచ్చరిక బోర్డు వద్ద రెవెన్యూ అధికారులు

బొబ్బిలి: పట్టణ పరిధిలోని సర్వే నంబర్ 242–6లోని మల్లంపేట కానిపూరి బందను కొంతమంది ఆక్రమించుకుంటున్నారన్న విషయం రెవెన్యూ అధికారులకు తెలిసింది. తహసీల్దార్ డోల రాజేశ్వరరావు ఆదేశాల మేరకు ఆర్‌ఐ కల్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో వీఆర్‌వో శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి ఆ ప్రాంతానికి ఆదివారం వెళ్లి, ఆక్రమిత ప్రభుత్వ భూమిని గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. అదే ప్రాంతంలో ఇది ప్రభుత్వ భూమి, ఆక్రమణదారులు శిక్షార్హులని తెలిపే హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌కు సన్మానం


తలే రాజేష్‌ను సన్మానిస్తున్న పార్టీ కార్యకర్త

రాజాం: పట్టణంలోని సీతామహాలక్ష్మి కాలనీ పరిధిలో ఉన్న లచ్చయ్యపేటలో వైఎస్సార్‌ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్‌ను అక్కడి పలు కుటుంబాలు ఆదివారం సన్మానించారు. ఈ వార్డులోని పార్టీ కార్యకర్తలను పరిచయం చేసుకునేందుకు వెళ్లిన ఆయనను సాదరంగా ఆహ్వానించి, సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు



సంకిలిలో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ పట్టాభి

రేగిడి: మండల వ్యాప్తంగా పారిశుద్ధ్య పనులు చాలా చురుగ్గా కొనసాగుతున్నాయి. అన్ని ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారన్న సదుద్దేశ్యంతో పారిశుద్ధ్య చర్యలు ముమ్మరం చేశామని ఎంపీడీవో శ్యామలాకుమారి తెలిపారు. ప్రజలు కూడా సహకరించాలని, తడిచెత్త, పొడిచెత్త వేర్వేరుగా రోజూ ఉదయం వీధుల్లోకి వస్తున్న గ్రీన్ అంబాసిడర్‌కు అందించాలని తెలిపారు.

వరి నూర్పిడి పనుల్లో రైతులు నిమగ్నం

వంగర: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న రైతులంతా వరి నూర్పిడి పనుల్లో నిమగ్నమయ్యారు. త్వరితగతిన వరికోతలు చేపట్టి, యంత్ర పరికరాలతో నూర్పిడి చేపట్టి, ధాన్యం సేకరిస్తున్నారు. ఇలా సేకరించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు.

ధాన్యం కొనుగోలు పరిశీలన


చాటాయవలసలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: మండలంలోని సంకిలి, చాటాయవలస గ్రామాల్లో జరుగుతున్న ధాన్యం కొనుగోలును మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ, తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి ఆదివారం పరిశీలించారు. మండల వ్యాప్తంగా ఉన్న 25 రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు జరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రగతి పథంలో.. రామభద్రపురం

- ప్రతీ సచివాలయం పరిధిలో రూ.20 లక్షలతో అభివృద్ధి
- గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం
- సీసీరోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి మినీట్యాంకుల నిర్మాణం
- నియోజకవర్గ వ్యాప్తంగా రూ.18.80 కోట్లతో పనులు


ఇంటింటికీ ఏర్పాటు చేసిన కుళాయిలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, ఎంపీపీ లక్ష్మణరావు(ఫైల్)


కొండకెంగువలో నిర్మిస్తున్న సీసీ డ్రైనేజీ

రామభద్రపురం: రాష్ట్ర వ్యాప్తంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చింది. ఇందులో భాగంగా ప్రతీ సచివాలయం పరిధిలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.20 లక్షల నిధులను విడుదల చేసింది. నియోజకవర్గంలోని రామభద్రపురం, బొబ్బిలి టౌన్, బొబ్బిలి రూరల్, తెర్లాం, బాడంగి మండలాల్లోని 94 సచివాలయాలు ఉండగా, ఆయా సచివాలయాల పరిధుల్లోని ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పర్యటించి, అక్కడ నెలకొన్న ప్రధాన సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖల ఆధ్వర్యంలో ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున మొత్తం 94 సచివాలయాలకు రూ.18.80 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో ప్రజల అత్యవసరాలకు అనుగుణంగా సీసీ


నాయుడువలసలో ఎస్‌డబ్ల్యూపీసీ, శ్మశానవాటికకు వెళ్లేందుకు వీలుగా రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు

రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి మినీ ట్యాంకులు తదితర అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ప్రధానంగా తాగునీరు, రోడ్లు, సీసీ డ్రెయిన్లు(డ్రైనేజీలు), పారిశుద్ధ్య పనుల నిర్వహణకు ప్రాధాన్యమిస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఈ పనులతో గతంలో పూర్తిగా అధ్వానంగా ఉన్న వీధులు ఇప్పుడు సరికొత్త నిర్మాణాలతో కళకళలాడుతున్నాయి. ప్రజలకు కూడా ఇబ్బందులు తొలగడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఈ చిత్రంలో కనిపిస్తున్నది తాగునీటి మినీవాటర్ ట్యాంకు. ఇది రామభద్రపురంలోని రెల్లివీధిలోనిది. ఇక్కడ ఎన్నో ఏళ్లుగా ఎన్నో ప్రభుత్వాలు, మరెంతోమంది ప్రజాప్రతినిధులు మారుతున్నా కాలనీ వాసుల తాగునీటి కష్టం మాత్రం తీర్చలేదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కాలనీలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు పర్యటించి, ఆ సమస్యను గుర్తించారు. ఆ తర్వాత వెంటనే రూ.14 లక్షలు మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నారు. కేవలం రెండు నెలల్లో తాగునీటి మినీ ట్యాంకు, పైపులైన్ ఏర్పాటు చేసి ఇంటింటికీ కుళాయిలు వేయించారు. దీంతో పాటు అదే వీధిలో సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మించారు.


రామభద్రపురం రెల్లివీధిలో ఏర్పాటు చేసిన తాగునీటి మినీ ట్యాంకు

అవస్థలు తప్పాయి..



గతంలో వీధిలో సరైన రోడ్డు లేకపోవడంతో నానా అవస్థలు పడ్డాం. అప్పటి పాలకులు, అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పట్టించుకోలేదు. ఏ చిన్నపాటి వర్షం పడినా తీవ్ర ఇబ్బందులు పడుతూ బురదలో నడిచి వెళ్లేవాళ్లం. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు దృష్టికి తమ కష్టాలను తీసుకువెళ్లాం. స్పందించిన ఆయన రూ.4 లక్షల నిధులను మంజూరు చేయించి, రోడ్డు వేయించారు. ఎమ్మెల్యేకు, ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం.

– పొట్నంగి వెంకటలక్ష్మి, తారాపురం.

మౌలికవసతులకు పెద్దపీట



ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేయడం జరిగింది. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు చొరవతీసుకుని మరీ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల అవసరాలు తీరేలా తాగునీరు, సీసీ రోడ్లు, డ్రెయిన్లు, పారిశుద్ధ్య పనుల నిర్వహణ పనులు చేయిస్తున్నారు.

– చొక్కాపు లక్ష్మణరావు, ఎంపీపీ, రామభద్రపురం.

అగ్నిఅస్త్రం తయారీపై అవగాహన


అగ్నిఅస్త్రం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారి శారద

రేగిడి: మండలంలోని ఉంగరాడ గ్రామంలో అగ్నిఅస్త్రం తయారీపై ఆదివారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ అధికారి సీహెచ్ శారద తొలుత అగ్నిఅస్త్రం తయారీని ప్రయోగాత్మకంగా రైతులకు తెలిపి, దాని ప్రయోజనాలను వివరించారు. పంటలకు రసాయన ఎరువులు వాడితే అధిక ఖర్చు కావడంతో పాటు ఆరోగ్యవంతమైన పంట కూడా చేతికి రాదన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాల ద్వారా తయారు చేసే ఘన, ద్రవ కషాయాల ద్వారా అధిక పంట దిగుబడి, ఆరోగ్యవంతమైన పంట చేతికి వస్తుందన్నారు. ఇప్పుడు రైతులు రబీ సాగులో భాగంగా వండిస్తున్న మొక్కజొన్న పంటకు కత్తెరపురుగు సోకుతోందని, దీని నివారణకు అగ్నిఅస్త్రం పిచికారీ చేస్తే సరిపోతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భుజంగరావు, ఎంపీటీసీ పిల్లా రోజా, అగ్రికల్చర్ అసిస్టెంట్ మహేష్, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది కె.పార్వతి, పి.గౌరీశ్వరరావు, జి.రవి. కె.రమణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు


బూరాడ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు వద్ద ఎస్‌ఐ శ్రీనివాసరావు

రేగిడి: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్‌ఐ ఇ.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చిన్నశిర్లాం, లింగాలవలస, బూరాడ జంక్షన్‌లలో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగ దగ్గర పడుతుండడంతో రోడ్లపై ప్రయాణించే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుందని, ఈ నేపథ్యంలో ఎక్కడా ఏం ప్రమాదం జరగకుండా చూస్తున్నామన్నారు. వాహనదారులు పరిమితికి మించి స్పీడుగా వెళ్లరాదని, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని సూచించారు. రాత్రి సమయాల్లో మద్యం సేవించి, వాహనాలు నడపకూడదన్నారు. మండలంలోని ప్రధాన కూడళ్ల వద్ద రాత్రి సమయాల్లో పోలీస్ గస్తీ ఏర్పాటు చేశామన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు గ్రామాల్లోకి వచ్చి, బంగారానికి మెరుగు పెడతాం, లోన్‌యాప్‌ల ద్వారా రుణాలు ఇస్తామని చెబితే నమ్మి, మోసపోవద్దన్నారు.

మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలి


సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయినులు

బొబ్బిలి: భారతదేశ ప్రప్రథమ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జన్మదిన తేదీ జనవరి 3ను మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కె.విజయగౌరి కోరారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సావిత్రిబాయి పూలే జయంత్యుత్సవాల్లో ఆమె మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ సావిత్రిబాయి పూలే ఆశయ సాధనకు అందరం కృషి చేయాలని కోరారు. అంతకుముందు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అలాగే వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు


కారులో తనిఖీలు చేస్తున్న సీఐ తిరుమలరావు, ఎస్‌ఐ సురేంద్రనాయుడు

రామభద్రపురం: మండల కేంద్రంలోని బైపాస్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద వాహన తనిఖీలు ఆదివారం ముమ్మరంగా చేశారు. సీఐ తిరుమలరావు, ఎస్‌ఐ సురేంద్రనాయుడు పోలీస్ సిబ్బందితో కలిసి అటువైపుగా వస్తున్న వాహనాలను ఆపి, సోదాలు చేశారు. మండల కేంద్రం అంతర్‌రాష్ట్ర కూడలి కావడంతో గంజాయి, కొకైన్, హెరాయిన్, ఖైనీ, గుట్కా వంటి నిషేధిత మత్తుపదార్థాల రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ తెలిపారు. ఎస్పీ దీపికా పాటిల్ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి, అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు చేపడుతున్నామన్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి


విద్యార్థినితో పుస్తకం చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: విద్యార్థులంతా ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదువంటే మాకిష్టం అనే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో పుస్తకాలు, కథలు చదివించడం, కథలు చెప్పించడం వంటివి చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ ఓ మంచి పుస్తకం చదవడం ద్వారా అపారమైన జ్ఞానం లభిస్తుందన్నారు. గ్రంథాలయాల్లో విజ్ఞానం పంచే మంచి మంచి పుస్తకాలు ఉంటాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

10న కోడూరులో కోలాటం పోటీలు

బాడంగి: మండలంలోని కోడూరులో ఈ నెల 10వ తేదీన కోలాటం పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు జి.కరుణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. దివంగత తెంటు భారతి జ్ఞాపకార్థం స్వర్ణభారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని, ఆసక్తి ఉన్నవారు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పోటీల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన వారికి వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు చొప్పున నగదు బహుమతి ఇవ్వనున్నామన్నారు. ఉదయం 9 గంటలకు జరిగే ఈ పోటీలను ప్రారంభించేందుకు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు విచ్చేస్తున్నారన్నారు.

విద్యార్థులకు అభినందనలు

సంతకవిటి: జవహర్ నవోదయ మోడల్ టెస్ట్‌లో విశేష ప్రతిభ కనబరిచిన మండలంలోని శేషాద్రిపురం సంతోషి హైస్కూల్‌కు చెందిన పలువురు విద్యార్థులను సిబ్బంది ఆదివారం అభినందించారు. జిల్లా స్థాయిలో 3, 7, 13, 14వ ర్యాంకులను వరుసగా బాడన చరణ్‌తేజ, తమ్మినేని విద్యాధరిచ, దూబకుల సాత్విక్, రివ్వ హాసిని సాధించారు.

10 నుంచి మండల స్థాయి పోటీలు

సంతకవిటి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 10వ తేదీ నుంచి మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.వి.రవికుమార్ ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. 10న వాలీబాల్ క్రీడలో పురుష జట్లు 23, మహిళా జట్లు 8, ఖోఖో క్రీడలో పురుష జట్లు 6, మహిళా జట్లు 9, 11న కబడ్డీ క్రీడలో పురుష జట్లు 18, మహిళా జట్లు 8, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడలో పురుష జట్లు 17, మహిళా జట్లు 12 తలపడనున్నాయన్నారు. 18, 19, 20వ తేదీల్లో జరిగే క్రికెట్ పోటీల్లో 24 సచివాలయాల నుంచి 24 పురుష జట్లు తలపడనున్నాయన్నారు. గెలిచిన జట్లు నేరుగా నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తాయన్నారు. 24 సచివాలయాల పరిధిలో మిర్తివలస సచివాలయం నుంచి మాత్రమే మహిళా జట్టు క్రికెట్‌కు రిజిస్టర్ చేసుకోవడంతో వారు నేరుగా నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు పేర్కొన్నారు.

కూరగాయల సాగుపై అవగాహన

రేగిడి: మండలంలోని చాటాయవలస గ్రామంలో భవానీ స్వయంశక్తి సంఘం సభ్యులకు సంబంధించిన 10 సెంట్ల భూమిలో కూరగాయల సాగుపై ఆదివారం అవగాహన కల్పించారు. ఫార్మ్ మోడల్ ద్వారా కూరగాయలను సాగు చేసుకోవడం, 365 రోజులూ ఆకుకూరలు, కూరగాయలు, తీగజాతి కూరగాయ మొక్కలు ఏ విధంగా పండించవచ్చో తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఎల్–2 పార్వతమ్మ, ఐసీఆర్‌పీలు తవిటినాయుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే ఆరా


వీరసాగరం గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: మండలంలోని వీరసాగరం గ్రామంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో నెలకొన్న సమస్యలు, జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరాతీశారు. ఈ నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న మేలును ప్రజలకు వివరించాలని పార్టీ నేతలకు సూచించారు. ఆయన వెంట జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు తదితరులు ఉన్నారు.

ఆదర్శభావాల నిధి ‘సంపూర్ణ’


సంపూర్ణ కవితా సంకలనం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాజాం రచయితల వేదిక సభ్యులు

రాజాం సిటీ: వర్ధమాన రచయిత మనసు నుంచి పెల్లుబికి వస్తున్న ఆదర్శభావాల నిధి ‘సంపూర్ణ’ కవితా సంకలనం అని రాజాం రచయితల వేదిక నిర్వాహకులు గార రంగనాథం అన్నారు. ఆదివారం స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో జరిగిన రాజాం రచయితల వేదిక సమావేశంలో బొద్దూరుకు చెందిన బంటుపల్లి గౌరునాయుడు రచించిన ‘సంపూర్ణ’ కవితా సంకలనం పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మ, ప్రకృతి, చదువు, సూక్తులు, వ్యక్తిత్వ వికాసం వంటి అనేక విషయాలను గౌరునాయుడు ఈ గ్రంథంలో సామాన్యులకు అర్థమయ్యేలా కవితలు, పద్యాల రూపంలో అందించారన్నారు. దివ్యాంగుడు అయినప్పటికీ ఓ వైపు ట్యూషన్ సెంటర్ నడుపుతూ మరోవైపు కవితా రచన చేస్తుండడం అభినందనీయమన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని, మరెంతోమంది యువ రచయితలు రావాలన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్త ఒమ్మి రమణమూర్తి, రాజాపు శాంతారావు, మూడడ్ల శ్రీనివాసరావు, గట్టి పాపారావు, సమతం మహేశ్వరరావు, పెంకి చైతన్యకుమార్, వేగిరెడ్డి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ పండగలా జరగాలి

- వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్


వంగర: లబ్ధిదారుకు పింఛన్ నగదు అందిస్తున్న గ్రామ వలంటీర్


రాజాం: మాట్లాడుతున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

రాజాం: మున్సిపాలిటీ పరిధిలో సోమవారం జరిగే కొత్త పింఛన్ల పంపిణీ పండగలా జరపాలని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. స్థానిక వేంకటేశ్వర కల్యాణ మండపంలో వార్డు సచివాలయ వలంటీర్లతో ఆదివారం సమావేశమైన ఆయన పలు సూచనలు చేశారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మధ్యాహ్నం 3 గంటలకు ఫించన్ల పంపిణీ జరుగుతుందని, లబ్ధిదారులంతా కార్యక్రమానికి హాజరయ్యేలా చూడాలని కోరారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు తదితరులంతా ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, యూత్ అధ్యక్షుడు వంజరాపు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వంగర: మండలంలోని అన్ని గ్రామాల్లో 99 శాతం మేర పింఛన్ల పంపిణీ పూర్తయిందని ఇన్‌చార్జ్ ఎంపీడీవో లోపింటి త్రినాథ్ ఆదివారం తెలిపారు.

12న బొబ్బిలిలో ఎంఆర్‌పీఎస్ మహాసభ


మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కో-కన్వీనర్ విజయ్‌కుమార్ మాదిగ

రామభద్రపురం: బొబ్బిలిలో ఈ నెల 12వ తేదీన జరిగే ఎంఆర్‌పీఎస్ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కో–కన్వీనర్ విజయ్‌కుమార్ మాదిగ కోరారు. ఆదివారం మండలంలోని ఆరికతోటలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసిరిపాటి బ్రహ్మయ్య మాదిగ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సభలో రాజకీయ, ఆర్థికాభివృద్ధి, విద్య, ఉద్యోగ రంగాల్లో బలపడడం, ఎస్సీ వర్గీకరణ వంటి విషయాలను చర్చించడం, వాటి సాధన దిశగా కార్యాచరణ రూపొందించి, దిశానిర్దేశం చేయడం జరుగుతుందన్నారు. ఈ సభకు ఉత్తరాంధ్ర జిల్లాల సంఘ నాయకులు, మేధావులు, విద్యార్థులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ ఉమ్మడి జిల్లాల కన్వీనర్ పెంకి సుధాకర్ మాదిగ, కో–కన్వీనర్ ఎం.ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.